ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -122 | పేజీలు - 8 వెల - 03/- | బుధవారం19 ఆగస్టు 2026

## స్థానిక సంస్థల్లో బీసీలకు
# 34 శాతం రిజర్వేషన్లు



**అసెంబ్లీ వేదికగా చారిత్రక నిర్ణయం ప్రకటించిన సీఎం చంద్రబాబు**



**రాష్ట్రంలో 28 జిల్లా పరిషత్‌ల ఏర్పాటు, మేయర్లు, ఛైర్మన్లకు ప్రత్యక్ష ఎన్నికలు**

**బీసీ రిజర్వేషన్లు తగ్గించి గత ప్రభుత్వం ద్రోహం చేసిందన్న ముఖ్యమంత్రి**

**పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు అండగా ఉంటామని స్పష్టీకరణ**

**అమరావతి, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
"పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు బీసీలకు వెన్నుదన్నుగా నిలుస్తాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని పునరుద్ఘాటించారు. మంగళవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ

మిగతా 2లో.



# ప్రపంచ డ్రోన్ హబ్ గా ఏపీ

**ఓర్వకల్లు డ్రోన్ సిటీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు**

**అన్నిరంగాల్లో పెరిగిన డ్రోన్ వినియోగం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో పారిశ్రామికవేత్తల రాక**

**డ్రోన్ల ఎగమతితో పెరగనున్న దేశ ఖ్యాతి**

**డ్రోన్ కంపెనీల సిఇవోలతో రామ్మోహన్ నాయుడు భేటీ**

8లో.

## ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు

**కోనసీమ మత్స్యకారుల గల్లంతు ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం**

**ఆగస్టు 3న వేటకు వెళ్లి తిరిగిరాని 8 మంది మత్స్యకారులు**

**కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ సమన్వయంతో గాలింపు ముమ్మరం**

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా**




**అమరావతి, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
కోనసీమ జిల్లా మత్స్యకారులు వున్న బోటు సముద్రంలో గల్లంతయిన ఘటనపై సీఎం చంద్రబాబు స్పందించారు. ఇవాళ సీఎంఓ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన ఎనిమిది మంది మత్స్యకారుల ఆచూకీ లభించేంత వరకు గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

మిగతా 2లో.

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

**సర్దార్ సర్వాయి పాపాన్న గౌడ్ గొప్ప యోధుడు**

**హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహావిష్కరణ**

**2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం**

**బిఆర్ఎస్‌లా సొంతవాళ్లకు పదవులు ఇవ్వలేదు**

**ఉద్యమకారులను గుర్తించి ఆదుకుంటున్నాం**

**విగ్రహావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం అద్భుతం అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అమరవీరుల స్థూపానికి ఉన్న ప్రాధాన్యతే పాపన్న విగ్రహానికి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు

మిగతా 2లో.





## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల , దళవాయి రమ

**అభ్యర్థుల ఎంపికకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్**

**ఆమోదం కోసం గవర్నర్ వద్దకు చేరిన దస్త్రం**

**సీనియారిటీకి, పార్టీ సేవకు గుర్తింపునిచ్చిన టీడీపీ అధిష్ఠానం**

**గత ఎమ్మెల్సీల పదవీకాలం ముగియడంతో ఏర్పడిన ఖాళీలు**

**అమరావతి, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌లో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థులను ఖరారు చేసింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సీనియర్ నేత వర్ల రామయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళా నేత దళవాయి రమాదేవిలను శాసనమండలికి నామినేట్ చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఈ మేరకు సిఫార్సులతో కూడిన దస్త్రాన్ని ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపింది.

మిగతా 2లో.

## మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

**: విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు**



## ఏ ప్రభుత్వ పాఠశాలను మూసివేయలేదు

**వైసీపీ హయాంలో ఫేక్ డేటా..**

**మేం వచ్చాక ప్రక్షాళన చేశాం: మంత్రి లోకేశ్**

**మా హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయన్న లోకేశ్**

**గత వైసీపీ ప్రభుత్వం ఫేక్ డేటాను చూపించిందని ఆరోపణ**

**డేటా ప్రక్షాళన తర్వాత ప్రవేశాల సంఖ్య పెరిగిందని వెల్లడి**

**గత రెండేళ్లలో ఏ ప్రభుత్వ పాఠశాలను మూసివేయలేదని స్పష్టీకరణ**

**అమరావతి, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
తమ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఫేక్ డేటా కారణంగా ప్రవేశాల సంఖ్య తప్పుగా నమోదైందని, తాము అధికారంలోకి వచ్చాక దాన్ని సరిచేశామని ఆయన పేర్కొన్నారు.

మిగతా 2లో.



## జనగణన తర్వాతే పంచాయతీల అప్‌గ్రేడ్..

**అసెంబ్లీలో మంత్రి నారాయణ**

**25 వేల జనాభా దాటిన పంచాయతీలపై అసెంబ్లీలో చర్చ**

**ప్రస్తుతం మున్సిపాలిటీలుగా మార్చే ప్రతిపాదన లేదని ప్రభుత్వం స్పష్టీకరణ**



**అమరావతి, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల రెండో రోజున కీలక అంశంపై ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 25 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఉన్నతీకరించే ప్రతిపాదన ప్రస్తుతానికి ఏదీ లేదని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

మిగతా 2లో.

# స్థానిక ఎన్నికల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లు

**మొదటిపేజీ తరువాయి**

కేబినెట్ తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని సీఎం ప్రకటించగానే సభ "జయహో బీసీ" నినాదాలతో దద్దరిల్లింది. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని మరోసారి నిరూపించుకుందని ఆయన అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రత్యేకంగా కేబినెట్ సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లను బీసీలకు వర్తింపజేయనున్నట్టు ప్రకటించారు.



ఉమ్మడి రాష్ట్రంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకొచ్చిన పంచాయతీరాజ్ చట్టం స్ఫూర్తితో, నిబంధనలకు లోబడే ఈ పెంపును అమలు చేస్తున్నామని వివరించారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో టీడీపీ ప్రభుత్వ హయాంలో 34 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని ఆయన సభకు గుర్తుచేశారు. ఈ 34 శాతం రిజర్వేషన్ల ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు.స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని చంద్రబాబు పునరుద్ఘాటించారు. 1984లో ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'యాక్ట్ ఆఫ్ 5' కింద దాన్ని 34 శాతానికి పెంచామని తెలిపారు.

తమ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేయడం వల్లే ఎర్రన్నాయుడు, కేఈ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు, దేవేందర్ గౌడ్, అయ్యన్నపాత్రుడు వంటి లెజెండరీ నాయకులు బీసీ వర్గాల నుంచి ఎదిగారని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రోత్సాహం అందిస్తే ఎంపీటీసీ స్థాయి నేత కూడా ఎంపీగా ఎదగొచ్చని, కర్నూలు జిల్లాకు చెందిన బస్తిపాటి నాగరాజును ఎంపీగా గెలిపించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లతో పాటు మరికొన్ని కీలక నిర్ణయాలను కూడా సీఎం ప్రకటించారు. సుస్థిర పాలన కోసం పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికను మళ్లీ ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తామని వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ప్రస్తుతం 13గా ఉన్న జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 28కి పెంచుతున్నట్లు తెలిపారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు పొందాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యవసరమని స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు, గ్రామీణ వృత్తులకు బీసీలే వెన్నెముక అని సీఎం కొనియాడారు. వారి నైపుణ్యానికి సాంకేతికతను జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్య అందిస్తామని, విద్య, ఉపాధి, నైపుణ్యం ద్వారా వారిని ఉన్నత స్థానంలో నిలబెడతామని హామీ ఇచ్చారు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, అవకాశం రాక వెనుకబడినవారని, వారికి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ చారిత్రక ప్రకటన అనంతరం బీసీ వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం వద్దకు వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు

**కోనసీమ కొబ్బరి రైతులకు అండగా ప్రభుత్వం**

**- దెబ్బతిన్న చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటడమే లక్ష్యం**

**- ఒక్కో మొక్కకు రూ.1,000 సాయం..**

**- శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** కోనసీమలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించడంతో పాటు కాలువలు, డ్రెయిన్ల పూడికతీత ద్వారా సమస్య మూలాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతుండగా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే 0.36 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతోందని మంత్రి తెలిపారు. కోనసీమ జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు కౌలు రైతుల ద్వారా సాగవుతున్నాయని వివరించారు.గత ఐదేళ్లుగా కాలువల్లో సక్రమంగా పూడికతీత చేపట్టకపోవడంతో సముద్రపు ఉప్పునీరు బ్యాక్ వాటర్ రూపంలో వెనక్కి వచ్చి నేలలో లవణీయత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రభావంతో పైకి ఆరోగ్యంగా కనిపించే కొబ్బరి చెట్లు కూడా అకస్మాత్తుగా కుంగిపోయి చనిపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించానని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దెబ్బతిన్న ప్రతి కొబ్బరి మొక్క స్థానంలో కొత్త మొక్క నాటేందుకు ఒక్కో మొక్కకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కొత్త మొక్కలు నాటడంతోనే సమస్య పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించకుండా ఎన్ని మొక్కలు నాటినా, ఎంత పెట్టుబడి పెట్టినా ఆశించిన ఫలితం ఉండదన్నారు. అందుకే సమస్యకు మూలమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొదటి విడతలో శంకరగుప్తం కాలువ పనులకు నిధులు కేటాయించామని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పటికే శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రెండు, మూడు నియోజకవర్గాల్లో ఉప్పునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన కాలువలను కూడా ఒక సమగ్ర ప్రాజెక్టుగా చేపట్టి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.కొబ్బరి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కొబ్బరి అభివృద్ధి మండలి (అఆః) సహకారంతో 2017-18 నుంచి 2024-25 వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5,250 హెక్టార్లను పథకం పరిధిలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కొత్త కొబ్బరి తోటల విస్తరణకు హెక్టారుకు రూ.56 వేల సబ్సిడీని రెండేళ్లలో రూ.28 వేల చొప్పున రెండు సమాన వాయిదాల్లో అందిస్తున్నామన్నారు.

# మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి

## : విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు

**విశాఖపట్నం ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేతలు ఉపయోగిస్తున్న అనుచిత భాషపై పార్టీ శ్రేణులు సంయమనం పాటిస్తూనే, పార్టీ గౌరవానికి భంగం కలగకుండా దీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలను అవమానపరుస్తోందని నితిన్ నబిన్ విమర్శించారు.



"పార్లమెంటులో ప్రతిపక్షాల తీరు, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను యావత్ దేశం గమనించింది. బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటారు, అయితే ప్రధానమంత్రి పట్ల ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని 'పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడు' అని ఎద్దేవా చేస్తూ, ఆయన కేవలం ప్రజల దృష్టిని మళ్లించే అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

ప్రధాని మోదీ నాయకత్వంలో 'వికసిత భారత్' ఆవిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, దేశవ్యాప్తంగా రూ. 8 లక్షల కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాటం

**మొదటిపేజీ తరువాయి**

మహేశ్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం పోరాడిన గొప్ప యోధుడని కొనియాడారు. అమరవీరుల స్థూపానికి ఎంత ప్రాధాన్యం ఉంటుందో పాపన్న విగ్రహానికి కూడా అంతే ప్రాధాన్యం ఉండాలని అన్నారు. బీసీ నేతల విజ్ఞప్తి మేరకు నెక్లెస్ రోడ్డుపై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. చరిత్రను చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డా మని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అక్రమ సంపాదనతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. 2029లో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని సీఎం రేవంత్ జోస్యం చెప్పారు. తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ జరిగితే 117 సీట్లతో అధికారంలోకి వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎం అయితే.. ఆయన కుమారుడు వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యారని గుర్తు చేశారు. కానీ రేవంత్ ముఖ్యమంత్రి అయితే.. మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ చీఫ్ అయ్యారని.. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీతక్క, వాకిటి శ్రీహరి మంత్రులయ్యారని సోదాహరణంగా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉద్యమకారులకు కీలక పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ, చాకలి ఐలమ్మ మనవరాలికి పదవులిచ్చామని పేర్కొన్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఎర్రబెల్లి, వినోద్‌రావుకు పదవులిచ్చారని వ్యంగ్యంగా అన్నారు. కేసీఆర్ సీఎం అయితే.. వారి కుటుంబ సభ్యులకు ఫామ్‌హౌజ్‌లు వచ్చాయని ఎద్దేవా చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల , దళవాయి రమ

**మొదటిపేజీ తరువాయి**

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న పండుల రవీంద్రబాబు, జాకియా ఖానమ్‌ల పదవీకాలం ముగియడంతో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలో అధికార టీడీపీ, పార్టీకి సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న ఇద్దరు నేతలకు అవకాశం కల్పించింది. దళిత వర్గానికి చెందిన వర్ల రామయ్య పార్టీలో కీలక నేతగా, గతంలో ఆర్టీసీ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2009లో తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి ఆయన పోటీ చేశారు.

మరోవైపు, అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవి బీసీ (వడ్డెర) సామాజిక వర్గానికి చెందిన నాయకురాలు. రెండు దశాబ్దాలుగా ఆమె పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనంతపురం పార్లమెంట్ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. ఆమె కుటుంబం మొదటి నుంచి టీడీపీకి అండగా నిలుస్తోంది. 2021లో అనంతపురం కార్పొరేటర్‌గా పోటీ చేసిన రమాదేవి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయానికి విశేషంగా కృషి చేశారు.

సామాజిక సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, పార్టీకి విధేయంగా ఉన్న సీనియర్ నేతకు, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా నేతకు పదవులు ఇవ్వడం ద్వారా టీడీపీ అధిష్ఠానం స్పష్టమైన సందేశం పంపినట్టయింది. ప్రస్తుతం ఈ ఫైల్ గవర్నర్ పరిశీలనలో ఉండగా, ఆయన ఆమోదముద్ర వేయగానే వీరి నియామకం అధికారికంగా ఖరారు కానుంది.

# జనగణన తర్వాతే పంచాయతీల అప్‌గ్రేడ్..

**మొదటిపేజీ తరువాయి**

జాతీయ జనాభా గణన (సెన్సస్) ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ విషయంలో ముందుకు వెళ్లలేమని ఆయన వెల్లడించారు.మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనాభా గణన ప్రక్రియ కొనసాగుతోందని, 2027 మార్చి 31 వరకు ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని ఆయన గుర్తుచేశారు.

జనగణన పూర్తయ్యే వరకు పరిపాలనా పరమైన సరిహద్దుల్లో ఎలాంటి మార్పులు చేయవద్దని కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని మంత్రి సభకు వివరించారు. అందువల్ల, జనాభా గణన ప్రక్రియ ముగిసిన తర్వాతే అధిక జనాభా గల పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆయన పేర్కొన్నారు. దీంతో కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుపై మరికొంత కాలం వేచి చూడక తప్పదని స్పష్టమైంది.

# ఆచూకీ లభించే వరకు గాలింపు చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఓడలరేవు, దుమ్మలపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన 8 మంది మత్స్యకారులు ఆగస్టు 3వ తేదీ ఉదయం 10 గంటలకు ఓడలరేవు జెట్టి నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లినట్లు అధికారులు సీఎంకు వివరించారు. బయలుదేరిన గంట తర్వాత, అంటే ఉదయం 11 గంటల వరకు వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారని, ఆ తర్వాత నుంచి వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. వారి బోటులో వీహెచ్ఎఫ్ సెట్‌తో పాటు వ్యక్తిగత మొబైల్ ఫోన్లు కూడా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

అధికారుల అంచనా ప్రకారం.. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోటు చేపలు పట్టే ప్రదేశానికి చేరుకొని ఉండవచ్చు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12 నాటికి బోటు తిరిగి రావాల్సి ఉన్నా రాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించామని అధికారులు సీఎంకు తెలిపారు.

కోస్ట్ గార్డ్ నౌకలను అప్రమత్తం చేసి గాలింపు చేపడుతున్నామని, అలాగే కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకార బోట్లకు కూడా సమాచారం అందించి గల్లంతైన బోటు ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి గాలింపు చర్యలను మరింత ఉద్ధృతం చేయాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలతో అధికారులు నిరంతరం టచ్‌లో ఉండాలని, గాలింపు వివరాలను ఎప్పటికప్పుడు వారికి తెలియజేస్తూ ధైర్యం చెప్పాలని సూచించారు. బాధిత కుటుంబాలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగించాలని స్పష్టం చేశారు.

# ఏ ప్రభుత్వ పాఠశాలను మూసివేయలేదు

**మొదటిపేజీ తరువాయి**

శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గాయని విమర్శించారు. 2022-23లో 7.6%, 2023-24లో 3.03%, 2024-25లో 3.24% చొప్పున ప్రవేశాలు తగ్గాయని గణాంకాలతో సహా వివరించారు.

ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నకిలీ డేటాను తొలగించామని, అవకతవకలను నివారించామని లోకేశ్ చెప్పారు. ఈ ప్రక్షాళన కారణంగా 2025-26లో ప్రవేశాలు 1.69% తగ్గినట్టు కనిపించినా, 2026-27 విద్యా సంవత్సరానికి వచ్చేసరికి 0.94% మేర ప్రవేశాలు పెరిగాయని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో ఒక్క ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలను కూడా మూసివేయలేదని మంత్రి సభకు తెలియజేశారు.

# హైకోర్టులో మీడియేషన్ సెంటర్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్.

**..ఆర్బిట్రేషన్ సెంటర్ కూడా ఏర్పాటు.**

**..ఏవో పోస్టు భర్తీకి కేబినెట్ ఆమోదం.**

**..సత్వర న్యాయ సేవల విస్తృతం కోసం చర్యలు.**

**..న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి.**




**అమరావతి, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో మీడియేషన్ సెంటర్ మరియు అర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశం లో ఆమోద ముద్ర వేయడం జరిగిందని న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన అంశాలకు ఆమోద ముద్ర వేసిన విషయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. 14 మంది సిబ్బందితో మీడియేషన్ సెంటర్ తో పాటుగా 15 మంది సిబ్బందితో ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేయడం జరిగిందన్నారు.హైకోర్టులో పరిపాలన సౌలభ్యం కోసం ఒక అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ )పోస్టును డైరెక్టరేట్ ఆఫ్ ప్రిజన్స్ క్రింద పనిచేస్తున్న పీపీ లేదా ఏపీపీ ద్వారా డిప్యుటేషన్ పై భర్తీ చేయడానికి కూడా మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని మంత్రి ఫరూక్ తెలిపారు.రాష్ట్రంలో న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి, విస్తృత చర్యలు తీసుకోవడంలో భాగంగా పరిపాలనాపరంగా కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు.పెండింగ్ కేసుల పరిష్కారానికి, సత్వర న్యాయానికి ప్రత్యేకంగా దృష్టి సారించి న్యాయ శాఖకు సంబంధించిన అన్ని విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. ఇప్పటికే హైకోర్టులో "రిజిస్ట్రార్" ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశామన్నారు. న్యాయ సేవలను విస్తృతం చేయడం ద్వారా న్యాయ స్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# గోరుకల్లు రిజర్వాయర్ వద్ద హైటెన్షన్

## పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డిని అడ్డుకున్న పోలీసులు.




**పాణ్యం, ప్రతినిధి ఆగస్టు 18, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)ః**
స్థానిక మండలంలోని గోరుకల్లు రిజర్వాయర్‌ను సందర్శించేందుకు వచ్చిన వైఎస్ఆర్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు రిజర్వాయర్ సందర్శనకు అనుమతి లేదంటూ మాజీ ఎమ్మెల్యేతో పాటు రైతులను కూడా పోలీసులు నిలువరించారు,దీంతో రిజర్వాయర్ ప్రధాన మార్గంలో కొద్దిసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే, రైతులు రిజర్వాయర్ వైపు వెళ్లకుండా పోలీసులు తాళ్లు, పోలీసు వాహనాలను రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేశారు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గోరుకల్లు రిజర్వాయర్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. ఈ క్రమంలో పోలీసులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి, రైతుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.పోలీసుల తీరుపై కాటసాని రామభూపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఎంత నీటి నిల్వ ఉంది? రిజర్వాయర్ పూర్తి నీటి నిల్వ సామర్థ్యం ఎంత? అనే వివరాలను అధికారులు స్వయంగా వచ్చి రైతులకు స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు,అంతేకాకుండా రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని గోరుకల్లు రిజర్వాయర్ నుంచి కేఎస్‌సీ కెనాల్, ఎస్సార్బీసీ కాలువలకు 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,రైతుల సాగునీటి అవసరాలు, ప్రస్తుత నీటి పరిస్థితిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని కాటసాని కోరారు. రిజర్వాయర్‌లోని నీటి నిల్వలు, నీటి విడుదలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు

# హత్య కేసులో ముగ్గురు ముద్దాయిల అరెస్ట్

## నేరానికి ఉపయోగించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 18)**
కర్నూలు నగరంలోని మాసుం బాష దర్గా సమీపంలో జరిగిన షేక్ ఇంతియాజ్ హత్య కేసును కర్నూలు ఒకటవ పట్టణ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌తో పాటు మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో కర్నూలు నగరంలోని మాసుం బాష దర్గా సమీపంలోని టీ స్టాల్ వద్ద షేక్ ఇంతియాజ్‌పై ముద్దాయిలు దాడి చేశారు. చాతిపై గుద్దడంతో పాటు తలపై బండరాయితో విచక్షణారహితంగా మోది తీవ్రంగా గాయపరిచారు. తీవ్ర రక్తగాయాలతో ఇంతియాజ్ మృతి చెందాడు. మృతుడి తమ్ముడు షేక్ ఇలియాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసులో నిందితులను త్వరగా పట్టుకోవాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాలు జారీ చేశారు. కర్నూలు డీఎస్పీ కె.వి. రాఘవేంద్ర ఆధ్వర్యంలో కర్నూలు ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ జి. మారుతి శంకర్, కోడుమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. తబ్రేజ్ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసులకు అందిన సమాచారం మేరకు ఈ నెల 17న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కర్నూలు నగరంలోని జొహరాపురం పక్కీ మసీదు వద్ద ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఒక సెల్‌ఫోన్, ఏపీ 40 డీవై 09803 నంబర్ గల రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.అదే రోజు సాయంత్రం 6.30 గంటల సమయంలో జొహరాపురంలోని ఇందిరమ్మ గృహాల వద్ద మరో ముద్దాయిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన మరో సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.అరెస్ట్ అయిన వారిలో కర్నూలు గనిగల్లీకి చెందిన షేక్ ఇమ్రాన్ (38), కర్నూలు ఒకటవ పట్టణ ప్రాంతానికి చెందిన మహమ్మద్ జవాద్ (25), కర్నూలు మొగల్‌పుర వీధికి చెందిన ఎస్.ఎం.డి. ఇర్ఫాజ్ (27) ఉన్నారు.అరెస్ట్ చేసిన ముగ్గురు ముద్దాయిలను కర్నూలు గౌరవనీయ జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని సెప్టెంబర్ 1, 2026 వరకు న్యాయపరమైన రిమాండ్‌కు పంపింది.
హత్య కేసును సత్వరం ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ అభినందించారు.

# రహదారుల పరిశుభ్రతకు ప్రాధాన్యత

**3 మెకానికల్ రోడ్ స్వీపర్ వాహనాలతో రాత్రింబవళ్లు ప్రధాన రహదారుల శుభ్రత**

**16 గంటల పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టేలా అదనపు సిబ్బంది**

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 18)**
నగరంలోని ప్రధాన రహదారులను పరిశుభ్రంగా ఉంచేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మూడు మెకానికల్ రోడ్ స్వీపర్ వాహనాలను వినియోగిస్తూ ప్రధాన రహదారులను రాత్రింబవళ్లు శుభ్రపరిచేలా చర్యలు చేపట్టినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు.
గతంలో రాత్రి సమయంలో మాత్రమే కొన్ని ప్రధాన రహదారులను శుభ్రపరిచేవారని, ఇకపై పగలు, రాత్రి కలిపి 16 గంటల పాటు పారిశుధ్య పనులు కొనసాగించేలా అదనపు సిబ్బందిని నియమించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఉదయం వై.జంక్షన్ వద్ద పెద్దపాడు రోడ్డులో మెకానికల్ రోడ్ స్వీపర్ వాహనం పనితీరును ఆయన పరిశీలించారు.
అనంతరం శ్రీనివాసనగర్, గుత్తి పెట్రోల్ బంక్, ఓమెగా ఆసుపత్రి ఎదురుగా ఉన్న రహదారి, మారుతినగర్ ప్రాంతాల్లో పర్యటించి పీజీఆర్ఎస్ ఫిర్యాదులకు సంబంధించిన సమస్యలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.
అలాగే పరిమళనగర్‌లోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ తనిఖీ చేసి అక్కడి నిర్వహణ, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు.
కమిషనర్ పర్యటనలో ఏసీపీ నాగరాజు, టీపీఈ ఖాసిం వలి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆలీంబాష, హుస్సేన్, ఏ. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నేతలు

## కర్నూలు జిల్లా అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో చర్చ




**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 18)**
కర్నూలు జిల్లాలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె ఆది కృష్ణమ్మ మర్యాదపూర్వకంగా కలిశారు.కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు స్వగృహంలో జరిగిన ఈ భేటీలో మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఆది కృష్ణమ్మ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.
ఈ సందర్భంగా కర్నూలు జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఆమె కేంద్ర మంత్రితో చర్చించారు.
అదేవిధంగా కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమిశెట్టి నవీన్ కూడా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు.
వారు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.
కర్నూలు జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు వారు తెలిపారు.

# కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు ఎస్పీ

## ఓర్వకల్లు విమానాశ్రయంలో పుష్పగుచ్ఛంతో స్వాగతం



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 18)**
ఓర్వకల్లు మండలంలోని కర్నూలు డ్రోన్ సిటీలో నిర్వహించనున్న ఏపీ డ్రోన్ పరిశ్రమ సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు కర్నూలుఓర్వకల్లు విమానాశ్రయానికి విచ్చేసిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీవిక్రాంత్ పాటిల్ కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు కొద్దిసేపు పరస్పరం మాట్లాడుకున్నారు.

# బిక్షాటన చేస్తున్న పిల్లలపై అధికారుల స్పెషల్ డ్రైవ్



**కర్నూలు (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 18):**
స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ అధ్యక్షతన మూడు డివిజన్ల లో బస్టాండ్, రైల్వే స్టేషన్ లు మరియు దేవాలయాలలో బిక్షాటన, బాలకార్మికులు మరియు వీధి బాలల కోసం సంబంధిత శాఖలను సమన్వయం చేసుకొని ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగానే మూడు టీమ్ లుగా డీసీపీయు యూనిట్ సిబ్బంది మరియు చైల్డ్ హెల్ప్ లైన్ -1098 సిబ్బంది కలిసి 4 పిల్లలను గుర్తించారు. అందులో కె నాగులపురం సుంకలమ్మ దేవాలయం దగ్గర గుర్తించిన అబ్బాయిని అదే గ్రామంలో సుంకులాపరమేశ్వరి స్కూల్ నందు 8వ తరగతికి జిల్లా బాలల పరిరక్షణ అధికారి శారద సమక్షంలో చేర్పించారు. వెంకయ్యపల్లి ఎల్లమ్మ ఆలయం దగ్గర ఇద్దరు పిల్లలను గుర్తించి బాలల సంక్షేమ సమితి వారి యొక్క దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో లీగల్ ప్రొహిబిషన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, ఇన్స్టిషనల్ కేర్ ఆఫీసర్ పద్మ, చైల్డ్ హెల్ప్ లైన్ -1098 జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుంకన్న, కౌన్సిలర్ నాగేశ్వర రావు, సోషల్ వర్కర్ నరసింహులు, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరెంటు కోసం రోడ్డెక్కిన రైతులు.

## రైతుల ఉసురు రేవంత్ రెడ్డికి ముట్టక తప్పదు.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్) ఆగస్టు 18**
అందోల్ మండలం అన్న సాగర్ గ్రామం దగ్గర ఉన్న సబ్ స్టేషన్ ముందు 24 గంటలు కరెంటు ఇవ్వాలని రైతులు రోడ్డెక్కి రఫ్తారోకో చేశారు. గత నాలుగు రోజులుగా అన్న సాగర్, డాకూర్, కిచ్చినపల్లి, ధనంపల్లి, మసన్పల్లి గ్రామాల రైతులు కరెంటు లేక పంటలు ఎండి పోతున్నాయని రైతులు రోడ్డు మీదకి వచ్చి వారి ఆవేదన వ్యక్తం పరిచారు. కెసిఆర్ ప్రభుత్వంలో రైతులకు 24 గంటలు కరెంటు ఇచ్చేవాడు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల బాధలు పట్టించుకోవడంలేదని వారు వ్యక్తపరుస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరుచుకొని రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని రైతులు ఆవేదన వ్యక్తపరిచారు. రైతులు ఇక్కడ ఏఈ, డీఈ లు కరెంటు కోసం ఎంత చెప్పినా వినిపించుకోలేదని రైతులకు కరెంటు విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఏ ఈ పైన మండిపడ్డారు.

# మీ సేవ యాప్‌లో ఆర్టీసీ టికెట్లు!



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్)ఆగస్టు 18**
హైదరాబాద్: త్వరలోనే ఆర్టీసీ టికెట్లను 'మీ సేవ' యాప్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. ప్రజా రవాణా సేవలు అయిన ఆర్టీసీ, మెట్రో, ఆటో, క్యాబ్.
ఇక నుంచి అన్ని ఒకే యాప్‌లో ప్రయాణికులకు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా ప్రయాణికుడు ఒకేచోట నుంచి ఆర్టీసీ, మెట్రో, ఆటో, క్యాబ్‌లో తన గమ్యస్థానానికి ముందస్తుగా టికెట్ బుక్ చేసుకోవచ్చు. ఛార్జీలను కూడా ఆన్ లైన్‌లో చెల్లించవచ్చు.

# ప్రమాద బాధితుడికి గుండుమల పరామర్శ

## సవేరా ఆసుపత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



**అనంతపురం/మడకశిర, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** బైక్ ప్రమాదంలో గాయపడి అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రామచంద్ర కుమారుడు భరత్‌చంద్రను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరామర్శించారు.

**భరత్‌చంద్రకు మెరుగైన వైద్యం అందించాలి**

ప్రమాదంలో గాయపడిన భరత్‌చంద్ర ప్రస్తుతం సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గుండుమల తిప్పేస్వామి మంగళవారం ఆసుపత్రికి వెళ్లారు. చికిత్స పొందుతున్న భరత్‌చంద్రను పరామర్శించి, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడిన ఆయన భరత్‌చంద్ర ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స, వైద్యుల పర్యవేక్షణ తదితర అంశాలపై ఆరా తీశారు. భరత్‌చంద్రకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

**కుటుంబ సభ్యులకు అండగా ఉంటా : గుండుమల:** ప్రమాదం కారణంగా ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులతో గుండుమల తిప్పేస్వామి మాట్లాడి ధైర్యం చెప్పారు. భరత్‌చంద్ర త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రమాదానికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యుల నుంచి తెలుసుకున్న గుండుమల తిప్పేస్వామి, భరత్‌చంద్ర ఆరోగ్యం మెరుగుపడేందుకు అవసరమైన చికిత్స కొనసాగించాలని సూచించారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ చికిత్స పొందాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. భరత్‌చంద్రను పరామర్శించిన గుండుమల తిప్పేస్వామికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదం అనంతరం తమ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పడం ఎంతో భరోసానిచ్చిందని పేర్కొన్నారు.

# ఎస్సీ కాలనీలో టీడీపీ ఇంటింటి ప్రచారం

## --8వ వార్డు యూనిట్ ఇంచార్జ్ కదిరి కోట షాలెం రాజు





**ఎమ్మిగనూరు, ఆగస్టు 18 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ ):** ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ఎస్సీ కాలనీలో 8వ వార్డు యూనిట్ ఇన్‌చార్జ్ కదిరికోట షాలేము రాజు ఆధ్వర్యంలో 143వ బూత్ పరిధిలో ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రతి ఇంటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురాగా, వాటిని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు భరోసా ఇచ్చారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలను నిరంతరం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, టీడీపీ కార్యకర్తలు ఎంఏ షేక్, కే. శాంతిరాజు, అనీలు, సీమోను, కిరణ, పౌలు తదితరులు పాల్గొన్నారు.

# సీయూఏపీ వీసీతో తలారి రంగయ్య భేటీ



**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 18,(రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీయూఏపీ) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.ఎ. కోరి ని మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంలోని వీసీ ఛాంబర్‌లో ఈ భేటీ జరిగింది.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి, విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, ఉన్నత విద్యా ప్రమాణాల పెంపు తదితర అంశాలపై ఇరువురూ చర్చించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతోపాటు, జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయానికి మరింత గుర్తింపు తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను వీసీ వివరించినట్లు తెలిసింది. సీయూఏపీని విద్యా, పరిశోధన రంగాల్లో మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు వీసీ ప్రొఫెసర్ ఎస్.ఎ. కోరి చేస్తున్న కృషిని మాజీ ఎంపీ తలారి రంగయ్య అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడంతోపాటు విశ్వవిద్యాలయం అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.

# లోకేష్‌ను కలిసిన దగ్గుపాటి, రమాదేవి

## అధినాయకత్వానికి రమాదేవి కృతజ్ఞతలు



**అనంతపురం సంక్షేమం,ఆగస్టు 18,(రిపబ్లిక్ న్యూస్):** విజయవాడలోని అసెంబ్లీ ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన దలవాయి రమాదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌లకు ఆమె, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దలవాయి వెంకటనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని రమాదేవి పేర్కొన్నారు. సామాజిక, రాజకీయ రంగాల్లో తనకు అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తగా, అనంతపురం నియోజకవర్గం క్లస్టర్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం దక్కడంపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం ఆమె చేసిన సేవలను గుర్తించి అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్‌తో నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై కూడా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# తాత్కాలిక ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు



**గుత్తి ఆగస్టు 18: (రిపబ్లిక్ న్యూస్)** గుత్తి బాలికల గురుకుల పాఠశాలలో తాత్కాలిక ప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ స్వాతి మంగళవారం తెలిపారు. గణితం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, పీఈటీ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంబంధిత పోస్టులకు పీజీ, బీఈడీ అర్హతలతో పాటు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు డెమోకు హాజరుకావాలని సూచించారు. ఆగస్టు 24, 2026న డెమో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ స్వాతి వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 8712625063 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

# వ్యక్తి ప్రాణాలు కాపాడిన రేణిగుంట పోలీసులు..



**రేణిగుంట ఆగష్టు 18(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 1:15 గంటల సమయంలో 112 అత్యవసర కాల్‌కు సమాచారం అందింది. శివకృష్ణ అనే వ్యక్తి 112కు ఫోన్ చేసి, తన బంధువు జి. రామకృష్ణ తాను ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు ఫోన్ ద్వారా తెలిపినట్లు సమాచారం ఇచ్చాడు.

వెంటనే రేణిగుంట పోలీసులు స్పందించి, రామకృష్ణ మొబైల్ ఫోన్ లొకేషన్‌ను గుర్తించి, అతను ప్రస్తుతం రేణిగుంటలో ఉన్నట్లు నిర్ధారించారు. సమాచారం మేరకు రేణిగుంట పోలీసులు తక్షణమే స్పందించి, రేణిగుంట ఆర్టీసీ బస్టాండ్ వద్ద జి. రామకృష్ణను గుర్తించి, సురక్షితంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు.

అనంతరం రామకృష్ణకు పోలీసులు ధైర్యం చెప్పి, ఆత్మహత్య ఆలోచనలకు దూరంగా ఉండేలా కౌన్సిలింగ్ నిర్వహించారు. అలాగే జరిగిన విషయాన్ని అతని కుటుంబ సభ్యులు మరియు బంధువులకు సమాచారం అందించి, అతని భద్రతకు అవసరమైన సూచనలు చేశారు. సకాలంలో 112 కాల్‌కు స్పందించి, మొబైల్ లొకేషన్ ఆధారంగా వ్యక్తిని గుర్తించి అతని ప్రాణాలను కాపాడిన రేణిగుంట పోలీసుల చర్యను అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే 112కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

# అభివృద్ధి పనులకు రూ.790 కోట్లు మంజూరు చేయాలి

## సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు వినతి



**అమరావతి ప్రతినిధి, ఆగస్టు18,(రిపబ్లిక్ న్యూస్):** మడకశిర నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి రూ.790 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. ఈ మేరకు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి పలు వినతిపత్రాలు సమర్పించారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గొల్లపల్లి నుంచి మడకశిర వరకు హంద్రీ-నీవా బైపాస్ కాలువ నిర్మాణంతో పాటు రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ల నిర్మాణం, కాలువల వెడల్పు, జంగిల్ క్లియరెన్స్ పనులకు కలిపి రూ.790 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని పేదల కోసం 12,500 గృహాలు మంజూరు చేయాలని, లో-వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సుమారు 11 ప్రాంతాల్లో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ముఖ్యమంత్రి నియోజకవర్గ పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ త్వరితగతిన అమలు చేయాలని కోరుతూ ప్రత్యేక వినతిపత్రాన్ని అందజేశారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు కోరారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలి

## శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలి: సమతా సైనిక్ దళ్



**ఎమ్మిగనూరు, ఆగస్టు 18(,ప్రజా రిపబ్లిక్ న్యూస్ )ం** బీసీలకు జనాభా ప్రాతిపదికన 34 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును రాష్ట్ర శాసనసభలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆమోదించాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సి. రంగయ్య డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి బీసీలు రిజర్వేషన్ల కోసం పోరాటాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు మారుతున్నా వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటే బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం సాధ్యమేనని, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకూడదని అన్నారు. బీసీల జనాభా నిష్పత్తి సగానికి పైగా ఉన్న నేపథ్యంలో వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితి ఉన్నప్పటికీ ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్ ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వర్తించని నిబంధనలు బీసీ రిజర్వేషన్ల విషయంలోనే ఎందుకు అడ్డంకిగా మారుతున్నాయని నిలదీశారు. కేంద్రం అనుమతి ఉన్నా లేకపోయినా రాజకీయంగా అయినా రాబోయే ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను 'బ్యాక్‌బోన్' అంటూ చెప్పినా, వారి రాజకీయ ఎదుగుదలకు అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. గత ప్రభుత్వ విధానాల మాదిరిగానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా బీసీలను చిన్నచూపు చూస్తే వారి ఆగ్రహానికి గురికాక తప్పదని రంగయ్య హెచ్చరించారు. బీసీల హక్కుల సాధన కోసం అవసరమైతే మరింత బలంగా ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు పాల్గొన్నారు.

# డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణకు ఘన సత్కారం



**గుత్తి ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్ ):** జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్న గుత్తి మండల డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణను పలువురు నాయకులు సన్మానించారు. ఆగస్టు 15న నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ ఆనంద్‌బాబు, ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పుణ్యవతి సమక్షంలో తెగదొడ్డి తిమ్మారెడ్డి, గోరంట్ల నాగయ్య రాయల్, చంద్రచౌదరి ధన, అంబటి రామాంజినేయులు తదితర బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు సూర్యనారాయణను సన్మానించి అభినందించారు.

# నీళ్లు లేకపోతే పంటలు ఎండిపోతాయి

## వైయస్సార్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూటూరు మారయ్య





**చిప్పగిరి, ఆగస్టు, 18, (రిపబ్లిక్ న్యూస్)** నీళ్లు లేకపోతే పంటలు ఎండిపోతాయని వైయస్సార్ పి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూటూరు మారయ్య మంగళవారం తెలిపారు, మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం హాలహార్వి మండలం బాపురం దగ్గర ఎల్ ఎల్ సి కెనాల్ లో నీటిని వెంటనే విడుదల చేయాలని హాలహార్వి మండల రైతులు కలిసి సాగు త్రాగునీరు కోసం నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేయడం జరిగింది కర్ణాటకకు చెందిన రైతులు 155 కిలోమీటర్ దగ్గర మట్టి సంచులు అడ్డకట్ట వేయడం ఇది ఒక హేయమైన చర్య కూటమి ప్రభుత్వం కలగజేసుకొని వెంటనే నీళ్లు విడుదల చేయాలని జూటూరు మారయ్య డిమాండ్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో తెర్నేకల్ సురేందర్ రెడ్డి రామిరెడ్డి వెంకటరెడ్డి గూళ్యం బసవరాజు బజరప్ప.అంచె గంగాధర్ మరియు ఆ మండలాల రైతులు తదితరులు పాలగ్గొన్నారు.

# నకిలీ కరెన్సీ ముఠా అరెస్టు

## రూ.22 వేల నకిలీ నోట్లు స్వాధీనం



**మడకశిర/అగలి క్రైమ్, ఆగస్టు 18,( రిపబ్లిక్ న్యూస్):** శ్రీ సత్యసాయి జిల్లాలో నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మడకశిర నియోజకవర్గంలోని అగలి మండలం నందరాజనపల్లిలో దుకాణాల్లో రూ.500 నకిలీ నోట్లను మార్చేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించడంతో నిందితులను పట్టుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటకకు చెందిన మహమ్మద్ అఫ్జల్‌తో పాటు 17 ఏళ్ల బాలుడిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి మొత్తం రూ.22 వేల విలువైన 44 నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ నోట్లు మార్చడం ద్వారా వచ్చిన రూ.5,700 అసలు నగదుతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ కరెన్సీ తయారీకి ఉపయోగించే యంత్రాన్ని ఉత్తర భారతదేశం నుంచి గౌరీబిదనూరుకు చెందిన ఓ వ్యక్తి సహకారంతో తీసుకొచ్చినట్లు నిందితులు విచారణలో వెల్లడించినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. నకిలీ నోట్ల తయారీ, చలామణి వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులకు నకిలీ నోట్లు ఎక్కడి నుంచి అందుతున్నాయి, తయారీకి ఉపయోగించిన యంత్రం ఎక్కడ ఉందనే అంశాలపై కూడా విచారణ కొనసాగుతోంది. నకిలీ కరెన్సీ చలామణి నేపథ్యంలో వ్యాపారులు, రైతులు నగదు లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా రూ.500 నోట్లను స్వీకరించే సమయంలో నోటుపై ఉన్న సెక్యూరిటీ థ్రెడ్, రంగు మారే లక్షణం తదితర భద్రతా గుర్తులను పరిశీలించాలని కోరారు. అనుమానాస్పద నోటు కనిపించినా, ఎవరైనా నకిలీ నోటును చలామణి చేసేందుకు ప్రయత్నించినా వెంటనే 100కు లేదా సమీప పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. నకిలీ కరెన్సీ చలామణికి అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా లావాదేవీలపై సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

రిపబ్లిక్
బుధవారం19 ఆగస్టు 2026

# కరువు కోరల్లో చిక్కుకున్న రైతాంగాన్ని ఆదుకోండి

**మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్**

**ఖరీఫ్ తుడిచిపెట్టుకుపోయింది.. రబీ ప్రశ్నార్థకం**

**హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కరువు ప్రాంతాలకు నీరు ఇవ్వాలి**

**రైతుల మోటార్లు తీసుకెళ్లడం ఆపాలి**




**అనంతపురం ప్రతినిధి, ఆగస్టు 18,(రిపబ్లిక్ న్యూస్):** కరువు కూరల్లో చిక్కుకున్న జిల్లా రైతన్న ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వైయస్సార్సీపి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ఆరుతడి, ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయి**

ఈ సందర్భంగా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితులు రోజురోజుకూ తీవ్రతరమవుతున్నా ప్రభుత్వం మాత్రం సమస్యను విపత్తుగా పరిగణించి తగిన చర్యలు చేపట్టడం లేదని ఆయన విమర్శించారు. ఖరీఫ్ సీజన్ దాదాపు తుడిచిపెట్టుకుపోగా.. రబీ సాగు కూడా ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులపై జిల్లా స్థాయిలో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. ప్రతిపక్ష పార్టీలు, రైతు సంఘాలు, వ్యవసాయ రంగ నిపుణులు, రైతు ప్రతినిధుల అభిప్రాయాలను తీసుకుని సమగ్ర కార్యాచరణ రూపొందించాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.
తుంగభద్ర, హంద్రీనీవా ప్రాజెక్టుల ద్వారా గతంలో దాదాపు 55 టీఎంసీల నీటిని జిల్లాకు తీసుకురాగలిగామని విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం పీఏబీఆర్, హెచ్ఎల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా జిల్లాకు ఎంత నీరు వస్తోంది..తాగునీటికి ఎంత కేటాయిస్తున్నారు.. సాగునీటికి ఎంత అందిస్తున్నారు.. అనే వివరాలను ప్రభుత్వం ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.పీఏబీఆర్ దుర్భర పరిస్థితుల్లో ఉందని, నీటి లభ్యతపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కరువు సమయంలో రైతులకు నీరు అందకపోవడంతో ఆరుతడి పంటలతోపాటు ఉద్యాన పంటలు కూడా దెబ్బతింటున్నాయని తెలిపారు.

**రైతుల మోటార్లు,విద్యుత్ మీటర్లు తొలగించడం సరికాదు**

హెచ్ఎల్సీ ద్వారా ప్రస్తుతం నీటిని అందించే పరిస్థితి లేకపోతే హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కరువు ప్రభావిత ప్రాంతాలకు నీటిని అందించాలని విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హంద్రీనీవా ద్వారా కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న జిల్లాలకు నీటిని అందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. నీటి కొరతతో రైతులు నరకయాతన అనుభవిస్తున్నారని, సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. తాగునీటి సమస్య కూడా తీవ్రమవుతున్నందున వచ్చే వేసవి వరకు ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని కోరారు.కరువు సమయంలో రైతుల మోటార్లు, విద్యుత్ మీటర్లు, వైర్లను తొలగించడం సరికాదని అన్నారు. రైతుల మోటార్లను ఎత్తుకెళ్లే చర్యలను నిలిపివేయడంతోపాటు ఇప్పటికే స్వాధీనం చేసుకున్న మోటార్లను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులపై నమోదు చేసిన కేసులను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు రైతులతో చర్చించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. కరువు పరిస్థితుల్లో రైతులను మరింత ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

**రూ.50 వేల చొప్పున ఆర్థిక భరోసా కల్పించాలి**

రైతులకు సబ్సిడీలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, పంటల బీమా విషయంలోనూ రైతులకు సరైన ప్రయోజనం దక్కడం లేదని విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించడంతోపాటు ప్రతి ఎకరాకు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ రంగానికి సంబంధించిన అధికారులు, రైతు సంఘాలు, నిపుణులు, రైతు ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జిల్లాకు ప్రత్యేక కరువు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరారు.

**32 లక్షల ఎకరాల సాగుభూమి1.03 లక్షల ఎకరాలకే నీరు**

రాయలసీమ జోనల్ సాధికార అధికారి రమణ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 32 లక్షల ఎకరాల సాగుభూమి ఉంటే కేవలం 1.03 లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని తెలిపారు. వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాలు, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులపై ప్రభుత్వం స్పష్టమైన లెక్కలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ రైతులకు సాగునీరు అందకపోవడం దురదృష్టకరమన్నారు.రాయలసీమ రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే నీరు, విద్యుత్, సబ్సిడీలు, పంటల బీమా, ఆర్థిక సహాయం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా రైతాంగం మొత్తం గళమెత్తి కరువు సమస్యపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# భారీగా గోవా మద్యం పట్టివేత

## 400 మద్యం బాటిళ్ల స్వాధీనం









**తాడిపత్రి క్రైమ్, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** గోవా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా మద్యం తరలిస్తున్న భారీ వాహనాన్ని ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. తాడిపత్రి రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ వద్ద చేపట్టిన తనిఖీల్లో లారీలో తరలిస్తున్న సుమారు 400 ఫుల్ బాటిళ్ల గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సాధారణ సరుకుల కింద ప్రత్యేకంగా రహస్య బాక్సులు ఏర్పాటు చేసి మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.
తనిఖీల నుంచి తప్పించుకునేందుకు స్మగ్లర్లు పక్కా ప్రణాళికతో వ్యవహరించినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. లారీలోని సాధారణ సరుకుల కింద ఎవరికీ అనుమానం రాకుండా హిడెన్ బాక్సులు ఏర్పాటు చేసి అందులో మద్యం బాటిళ్లను దాచినట్లు అధికారులు గుర్తించారు. మరింత సంచలనంగా ఒకే లారీకి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రెండు వేర్వేరు నంబర్ ప్లేట్లు ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. రాష్ట్రాల సరిహద్దుల్లో తనిఖీలను తప్పించుకునేందుకే నంబర్ ప్లేట్లను మార్చే వ్యూహాన్ని అనుసరించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.మద్యం తరలిస్తున్న లారీ డ్రైవర్‌ను ఎస్ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.
గోవా నుంచి మద్యం ఎక్కడికి తరలిస్తున్నారు. ఎవరికి అప్పగించాల్సి ఉంది. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారం వెనుక అంతర్రాష్ట్ర మద్యం స్మగ్లింగ్ ముఠా ప్రమేయం ఉండొచ్చన్న అనుమానంతో అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు.లారీకి రెండు రాష్ట్రాల నంబర్ ప్లేట్లు ఎలా వచ్చాయి.గతంలో ఈ వాహనం ఎక్కడెక్కడ తిరిగింది. గోవా నుంచి మద్యం తరలింపులో ఎవరెవరి ప్రమేయం ఉంది. తాడిపత్రి పరిసరాల్లో ఈ సరుకును ఎవరికి అందించాల్సి ఉంది అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల్లోని సంబంధాలను గుర్తించే దిశగా కూడా దర్యాప్తు సాగుతున్నట్లు సమాచారం.తాడిపత్రి ప్రాంతంలో భారీగా గోవా మద్యం పట్టుబడటంతో అక్రమ మద్యం రవాణా పై జిల్లాలో భారీగా చర్చ మొదలైంది. గతంలో ఉమ్మడి అనంతపురం, కడప జిల్లాల్లో వెలుగుచూసిన అక్రమ మద్యం రవాణా వ్యవహారాలతో తాజా ఘటనకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలోనూ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. డ్రైవర్ విచారణలో వెలుగుచూసే వివరాల ఆధారంగా మద్యం సరఫరా గొలుసుకట్టు వ్యవహారంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దర్యాప్తు పూర్తయితే గోవా నుంచి తాడిపత్రి మీదుగా సాగుతున్న అక్రమ మద్యం రవాణా వెనుక ఉన్న కీలక వ్యక్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.వివరాలు తెలియాల్సి ఉంది.

# 34శాతం రిజర్వేషన్లపై స్వప్న హర్షం



**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 18,(రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ వర్గాలు ఆనందంతో స్వాగతిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్జాపూర్ స్వప్న తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం సామాజిక, రాజకీయ సాధికారత దిశగా చారిత్రాత్మక అడుగని పేర్కొన్నారు. రానున్న గ్రామపంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలన్న చిరకాల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చిందని స్వప్న అన్నారు. ఈ నిర్ణయం ద్వారా బీసీలకు రాజకీయంగా మరింత అవకాశాలు లభించడంతోపాటు స్థానిక సంస్థల్లో వారి భాగస్వామ్యం బలోపేతమవుతుందని పేర్కొన్నారు.బీసీల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, రాజకీయ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ నిర్ణయం రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆమె అన్నారు.
బీసీల తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలోని అన్ని బీసీ వర్గాలు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్థానిక సంస్థల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించాలని స్వప్న పిలుపునిచ్చారు. బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి మంచి కార్యక్రమానికి బీసీ వర్గాలు సంపూర్ణ మద్దతుగా నిలవాలని ఆమె కోరారు.

# మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరెస్ట్

## మైనింగ్ క్వారీ ప్రమాదం కేసు

## అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్

**అమరావతిఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**ప్రకాశం జిల్లాలో మైనింగ్ క్వారీలో జరిగిన ప్రమాదం కేసులో అనుకూల నివేదిక కోసం లంచం డిమాండ్ చేసిన వ్యవహారంలో పలువురి ప్రమేయం ఉన్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. అలాగే ప్రైవేట్ మైనింగ్ సంస్థ ప్రతినిధి, కన్‌స్టలెంట్‌ను అరెస్ట్ చేశారు. వీరిని విజయవాడ కోర్టులో హాజరుపరచనున్నారు. గతంలో మైనింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు రూ. లక్ష లంచం ఇచ్చినట్లు కూడా సీబీఐ గుర్తించింది. అనుకూల నివేదికతో పాటు మైనింగ్ సంస్థ నుంచి త్రైమాసిక లంచాల కోసం రూ. 2 లక్షలు ఏర్పాటు చేసినట్లు కనుగొంది. మైనింగ్ క్వారీ ప్రమాదంలో అనుకూల నివేదిక కోసం రూ. 2 లక్షల నగదు తీసుకుంటూ డిప్యూటీ డైరెక్టర్‌ను సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సంగతి తెలిసిందే. సందర్భంగా ఆ నగదును సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఒంగోలు, కడప, హైదరాబాద్‌లలో నిందితులకు చెందిన ఇళ్లలో కూడా సీబీఐ సోదాలు చేపట్టింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ అధికారులు ఈ సందర్భంగా వివరించారు.

# చరిత్రలో బీసీలు మరిచిపోలేనిరోజు

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై హర్షం**

**గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు**



**అమరావతి,ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్)::** 'చరిత్రలో ఈరోజు బీసీలు మరిచిపోలేని రోజు... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది... గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు కాబోతున్నాయి...' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సంతోషం వ్యక్తంచేశారు.
స్థానిక స్వపరిపాలనలో వెనుకబడిన వర్గాలకు సాధికారత కల్పించడంపై శాసనసభలో లఘు చర్చ జరిగింది. మంత్రి సవిత ఈ చర్చను ప్రారంభించారు. బీసీలకు అవకాశం ఇవ్వడం, ప్రాతినిధ్యం కల్పించడం రాజకీయ సాధికారిత కల్పించడం తమ విధి అని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు ఈరోజు మంత్రి మండలిలో ఆమోదించామన్నారు. బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు జగన్ ప్రభుత్వం కోత పెట్టడం వల్ల 16 వేలకు పైగా పదవులకు బీసీలు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం శాసనసభలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల బిల్లు చర్చ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు ఎస్.సవిత మాట్లాడారు. బీసీల పక్షపాత్రి ప్రభుత్వం తమదని మరోసారి రుజువైందన్నారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పించాలని నిర్ణయించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం మేర రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై మంత్రిమండలిలో ఆమోదించామన్నారు. అసెంబ్లీలో కూడా ఆమోదిస్తున్నా మన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన ాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు మొట్టమొదటిసారిగా 1994లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. ఇప్పుడు మరోసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పనతో బీసీలకు రాజ్యాధికారంలో అవకాశం కలుగుతుందన్నారు. తమను తాము పాలించుకునే అవకాశం కలుగుతుందని, చరిత్రలో నేడు మరిచిపోలేని రోజు అని మంత్రి సవిత ఆనందం వ్యక్తం చేశారు. బీసీలకు మరోసారి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించడానికి సీఎం చంద్రబాబు నిర్ణయించారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించబోతున్నామని చెప్పారు. బీసీలకు రాజకీయ పట్టం కల్పిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు సవిత ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబు రాకతో బీసీలకు మరోసారి మంచిరోజులు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత మొదటి బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్ లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్‌లో రూ.51 వేల కోట్లు బీసీలకు కేటాయించామని చెప్పారు. అధికారంలోకి రాగానే స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, చట్టసభలలో బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రప్రభుత్వ తదుపరి చర్యకు పంపించామని చెప్పారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# ట్రాక్టర్ అదుపుతప్పి యువకుడు మృతి





**రాయికల్ మండలం ఆగస్టు18( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కొత్తపేట ఎక్స్ రోడ్ భూపతిపూర్ మార్గమధ్యంలో ఈరోజు జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో రాయికల్ మండలంలోని కొత్తపేట వడ్డెర కాలనీకి చెందిన అలకుంట మహేష్ అనే యువకుడు మృతి చెందాడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో మహేష్ వాహనం కింద చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు ఈ ఘటనతో వడ్డెర కాలనీలో విషాదఛాయలు అలుము కొన్నాయి

# ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

**న్యూఢిల్లీఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక ల్ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్‌లో దాడులకు అల్‌ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను పూ÷-రోత్సహిస్తోందని అంటున్నారు.

ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్‌ఎస్‌జీ, ఎన్‌ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్‌లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువుల ను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవవల పాక్‌కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్‌కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్‌తో ఇది సమిసి పోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్‌కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో



ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టిసిఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్దతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్ లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండండం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి పోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్క ఇస్లామిక్ తీవ్రవాదులు
ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం.

# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

## ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్

**న్యూఢిలీఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్య దినోవ్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్య వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల్గ÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

----------

# 29న రైతు పంచాయితీకి సిద్ధం అవుతున్న పంజాబ్ రైతులు



**న్యూఢిల్లీ,ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**ప్రతిపాదిత భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా జగ్జీత్ దల్లేవాల్ నేతృత్వంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 29న దేశ రాజధానిలో 'రైతు పంచాయతీ' జరుగనున్నది. కాగా ఆదివారం ఢిల్లీ మార్చ్‌కు బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్ వైపున గల ఖానౌరీ సరిహద్ద వద్ద జింద్ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడింగ్‌తో ఆ మార్గాన్ని సీల్ చేశారు. జగ్జీత్ దల్లేవాల్ హర్యానా- పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇది ఆగస్టు 29న రాజధానిలో 'రైతు పంచాయతీ'తో ముగుస్తుందని తెలియజేశారు. క్రిసాన్ మోర్చా ప్రతినిధులకు హర్యానా అధికారులకు మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

------------

# నిర్మలాసీతారమన్‌కు బాబు, లోకేశ్ శుభాకాంక్షలు

**అమరావతి,ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జన్మదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని దేవుడిని ప్రార్థించారు. ఆపారమైన శక్తితో దేశ ప్రగతిని ఆమె ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ పోస్టు పెట్టారు. 'గౌరవనీయ కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆయురారోగ్యాలతో సంతోషంగా నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటున్నాను. దేశ ప్రగతికి మీరు అదే అంకితభావం, అవిశ్రాంత శక్తితో మార్గనిర్దేశర చేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. నిర్మలా సీతారామన్‌కు మంత్రి నారా లోకేశ్ కూడా పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలిపారు. దేశానికి ఆమె అందిస్తున్న విశిష్ట సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రికి మంచి ఆరోగ్యం, సంతోషం, మరింత శక్తి లభించాలని దేవుడిని కోరారు. రాబోయే ఏడాది మరిన్ని విజయాలు సాధించాలని లోకేశ్ ప్రార్థించారు.

-------

# రోడ్డు పనుల్లో తవ్వుతుండగా రెండు శవాలు లభ్యం



**విశాఖపట్నం,ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**నగరంలోని షీలా నగర్‌లో రెండు మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. షీలానగర్ జంక్షన్ వద్ద నిర్మాణంలో ఉన్న షీలానగర్-సబ్బవరం పోర్టు కనెక్టివిటీ రోడ్డు పనుల్లో భాగంగా రెండు గుర్తుతెలియని శవాలు లభించాయి. మంగళవారం డంపర్ లారీలు మట్టి వేస్తుండగా కుప్పలో 2 శవాలు కనిపించాయి. దీంతో సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు అక్కడకు చేరుకుని ఘటనా స్థలిని పరిశీలించారు. ఒకటి మహిళ మృతదేహం కాగా మరొకటి పురుషుడి మృతదేహంగా గుర్తించారు. రెండు మృతదేహాలూ పూర్తిగా డికంపోజ్ అయినట్లు తెలిపారు. అంతేకాకుండా.. మట్టిలో పాత తలగడలు, బొంతలు, పూలమాలలు, చెక్కలు లభ్యమయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు పనుల్లో భాగంగా ఉపయోగించిన
మట్టి.. శ్మశానం నుంచి తీసుకొచ్చినట్లుగా అనుమానిస్తున్నామని ఏసీపీ శ్రీనివాసరావు వెల్లడించారు.

# దిమాగీ నక్సల్స్..మరో పార్టీ పుట్టుక

## ప్రధాని నోట మాటరావడం ఆలస్యం.. -సోషల్ మీడియాలో ఉత్పన్నం

**న్యూఢిల్లీ,ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** కాక్రోచెస్ అంటూ సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యల ఆధారంగా కాక్రోచ్ జనతాపార్టీ పుట్టుకు వచ్చింది. ఇటీవల ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద తన సత్తా చాటింది. ఇప్పుడు ఇలాంటిదే మరో పార్టీ పుట్టుకు వచ్చింది. సాయుధ నక్సల్స్‌ను నిర్మూలించామని.. దిమాగీ నక్సల్స్ మాత్రం మిగిలారంటూ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ వ్యాఖ్యల ఆధారంగా కొత్తపార్టీ పుట్టుకువచ్చింది. మోదీ ఆ వ్యాఖ్యలు చేసిన 24 గంటల్లోనే దిమాగీ నక్సల్ అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తెరిచిన పార్టీ ఖాతాలకు అనూహ్య ఆదరణ లభించింది. ఇన్‌స్టాలో 1.81 లక్షలమంది, ఎక్స్‌లో 7000 మంది ఆ ఖాతాలను అనుసరించారు. ఇన్‌స్టాలో దిమాగి నక్సల్ జనతా పార్టీ అనే పేరుతో ఖాతాలు తెరిచారు. యువత ప్రశ్నించడమే కాదు, సమస్యలకు పరిష్కార మార్గాలను కూడా వెతకాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ఐఐటీ ఢిల్లీ యాభై ఏడవ స్నాతకోత్సవంలో చేసిన వ్యాఖ్యల సంగతి ఎలా ఉన్నా యువత ప్రశ్నిస్తూనే ఉంది. సమస్యలకు పరిష్కరాం చూపాలని ప్రధాని మోడీ అనడం చూస్తుంటే..పాలకులు ఎందుకన్న ప్రశ్న ఉదయిస్తోంది. నిజానికి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? అధికారంలో ఉన్న పాలకులదాకాదా అన్నది తేల్చాలి. 2014లో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు యువతకు ఎన్నో ఆశలు కల్పించింది. ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధి, తయారీ రంగం విస్తరణ, పెట్టుబడుల




పెంపు, అవినీతి నిర్మూలన, నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి అంశాలపై ఎన్నో హామీలు ఇచ్చారు. అవన్నీ మరచిపోవడం మోడీకి తగదు. ఇవన్నీ పక్కన పెట్టి దిమాగీ నక్సల్స్ అని మేధావులను దూషించడం కూడా సరికాదు. ఇప్పటివరకు యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయంటే.. చెప్పలేం. ఆందోళనలు చేస్తున్న యువతను చూసైనా పాలకులు కళ్లు తెరవాలి. పేపర్ లీకేజీలతో విద్యార్థుల ఆశలపై నీల్లు చల్లడం వల్లనే కదా యువత ఆందోళన బాట పట్టింది. నీట్ వివాదం ఈ పరిస్థితికి ఒక ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు నెలల తరబడి ఆందోళనలు చేస్తే, వారి సమస్యలను వినడం, విచారణ జరిపించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం లాంటి పనులను ప్రభుత్వం చేయడంలేదు. పైగా నిరసనకారులకు 'పరిష్కారం మీరే చూపండి' అని చెప్పడం ద్వారా ఏం సందేశాన్ని ఇవ్వదలుచుకున్నారో మేడీ చెప్పాలి. ఈ చర్య నిశితంగా పరిశీలిస్తే ప్రభుత్వం పాలనా బాధ్యతలు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా ఉంది. పరిష్కారం చూపాలంటే ముందు యువతకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి. నిజానికి యువత కోరుతున్నది కూడా ఈ దేశ అభివృద్ధిలో తమను కూడా భాగస్వాముల్ని చేయమని, తమకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించమని అంటున్నారు. తద్వారా వికసిత భారత్‌లో తమను కూడా భాగస్వాములను చేయమంటున్నారు. ఇవి ఏవీ జరగకుండా, అన్నింటికీ దూరంగా ఉంచడం వల్ల అభివృద్ధి ఎలా జరుగుతుందని అనుకుంటున్నారో వివరించాలి. యువత ప్రశ్నలు నీట్‌కే పరిమితం కావాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న విదేశీ అప్పు, ధరలు, నిరుద్యోగం, అవినీతి ఆరోపణలు, పరిపాలనలో జవాబుదారీతనం, రాజకీయ ఫిరాయింపులు, దర్యాప్తు సంస్థలు, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థల స్వతంత్రతపై వ్యక్తమవుతున్న సందేహాలు.. ఇవన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. అయితే ప్రభుత్వం తన అధికారాన్ని ప్రశ్నను అణచడానికి కాకుండా, సమస్యను పరిష్కరించడానికి వినియోగిస్తే అసలు సమస్యే ఉండదు. కానీ ప్రభుత్వ ధోరణి అలా కనిపించడం లేదు. యువత పరిష్కారాలు చూపాలి, అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదు అంటే కుదరదు. అందుకువ దిమాగీ నక్సల్ అనగానే పార్టీ పుట్టుకు వచ్చింది. ఇది ఓ రకంగా ప్రశ్నించడానికే అనుకోవాలి. ప్రశ్నలకు నాయకులు పరిష్కారాలు చూపించడానికి సిద్ధంగా ఉండాలి.

# మమ్మల్ని చంపేయండి: ఝార్ఖండ్ ప్రభుత్వ నిర్ణయంపై ఎంపికైన అభ్యర్థుల ఆవేదన

**న్యూఢిల్లీ,ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
ఝార్ఖండ్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన జేఎస్‌ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షలతో పాటు ఇతర నియామక పరీక్షలను రద్దు చేస్తూ తీసుకున్న సంచలన నిర్ణయం తీవ్ర కలకలం రేపుతోంది. పరీక్ష నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ దాదాపు నెల రోజులుగా విద్యార్థులు చేపడుతున్న ఆందోళనల నేపథ్యంలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఈ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఇప్పటికే ఈ పరీక్షల ద్వారా ఎంపికై, ఉద్యోగాల్లో చేరిన దాదాపు 2 వేల మంది అభ్యర్థులు తమ భవిష్యత్తు ఒక్కసారిగా అంధకారంలోకి వెళ్లిపోయిందంటూ రోడ్డుపైకి వచ్చి ఆందోళనకు దిగారు. ఎంపికైన అభ్యర్థులు తీవ్ర మనోవేదనకు గురవుతూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ నియామక పత్రాల ఆధారంగానే తాము పాత ఉద్యోగాలకు రాజీనామా చేసి ఇక్కడ చేరామని... ఇప్పుడు హఠాత్తుగా ఉద్యోగాలు ఊడగొట్టడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గరిష్ఠ వయోపరిమితి దాటిపోవడం వల్ల కొత్తగా ఎలాంటి ఉద్యోగ పరీక్షలు రాయలేని పరిస్థితి నెలకొందని... ఇటు పాత ఉద్యోగం లేక, అటు కొత్త ఉద్యోగం ఊడిపోయి తీవ్రంగా నష్టపోయామని కంటతడి పెడుతున్నారు. తమను ఇలా బ్రతికుండగానే చంపేసే బదులు తుపాకీతో కాల్చేయడం మేలని బాధితులు వాపోతున్నారు.2024 జేఎస్‌ఎస్‌సీ-సీజీఎల్ నియామకాల ప్రక్రియ మొదటి నుంచి తీవ్ర వివాదాస్పదమైంది. ప్రశ్నాపత్రాల లీకేజీ, ఏజెన్సీ అక్రమాలపై సీఐడీ విచారణ చేపట్టినప్పటికీ... గతంలో హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అర్హులైన వారికి నియామక పత్రాలు అందజేశారు. అయితే, తాజాగా విద్యార్థుల నిరసనల ఒత్తిడికి తలొగ్గి ప్రభుత్వం ఈ పరీక్షలను రద్దు చేయడంతో బాధితులు సచివాలయం ముందు వర్షంలోనే నిరసనలు తెలుపుతున్నారు. వారు న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

# తెలంగాణ శివాజీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

## చత్రపతి శివాజీ మహారాజ్ సమకాలికుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ -తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్

**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 18**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ గారు మాట్లాడుతూ ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించిన తొలి తెలంగాణ తెలుగు తేజం గోల్కొండ కోటపై మొగలాయిల పెత్తనాన్ని ధిక్కరించిన ధీరుడు. ఔరంగజేబుకే ఉచ్చుముటలు పట్టించిన జయశాలి అని పేదల పాలిట పెన్నిధి సమ సమాజ స్థాపన సాధనకు ప్రాణం పెట్టిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను కొనియాడారు గోల్కొండ కోటపై విజయపతాకమే ఎగరవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని 12 మంది అనుచరులతోమొదలైన సైన్యం 12 వేలకు చేరిందంటే ఆయన ఘనత అర్థం చేసుకోవచ్చు చెప్పారు 1650 లో వరంగల్ జిల్లాలోని తాటికొండ గ్రామంలో సాధారణమైన కుటుంబంలో జన్మించాడు బాల్యంలోనే తన గౌండ్ల కుల వృత్తిని పాటించనని తన తల్లి దగ్గర ప్రతిజ్ఞ చేశాడని ప్రశంసించారు శ్రామిక కులాల నైపుణ్యాలను శాస్త్రీయ జ్ఞానాన్ని నిర్వహణ నైపుణ్యాలను కలిగి ఉన్నాయని ఇవేవీ లేని వారు స్థానిక పాలకులుగా రాజులుగా ఉండడం జీర్ణించుకోలేకపోయాడు గోల్కొండ కోటపై శ్రామికుల జెండా ఎగురవేస్తానని శబదం భూనాడు అన్నట్టుగానే కోటలు కడుతూ తన సైన్యాన్ని తయారు చేసుకున్నాడు తొలి తెలుగు బహుజన చక్రవర్తిగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రలో నిలిచాడు



బహుజనులకు రాజ్యాధికారం దక్కాలని ఆనాడే పోరాటాలు చేసిన వీరుడుకులవృత్తులను ఐక్యం చేసి పోరాడాడుప్రజలను పీడుస్తున్న భూస్వాములపై దాడులు చేసే వారి ఆస్తులను హస్తగతం చేసుకొని పేద ప్రజలకు వారి భూములను పంచి పెడుతూ మిగతా సొమ్మును కోటాల కోసం వెచ్చించాడు ఔరంగజేబు మరణం గోల్కొండ రాజ్యమును భువనగిరి కోట తో సహా అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు భారతీయ సామాజిక చరిత్రలో ఒక కళ్ళు గీసే వ్యక్తి ప్రభు హోదాను పొందడం సర్వాయి పాపన్న గౌడ్ తోనే ప్రారంభమైంది చత్రపతి శివాజీ మహారాజ్ సమకాలికుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఘనతను ప్రశంసించారు ఈ విధంగా 376 వ జయంతిని మనమందరము ఆదర్శంగా తీసుకొని బహుజనులకు రాజ్యాధికారం



దక్కడం కోసం తన ప్రాణం పెట్టిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ బాటలోనే మనమందరము పైనిద్దామని పిలుపునిచ్చారు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అన్ని గ్రామాల్లో జరపాలని తెలంగాణ స్టేట్ భీమ్ ఆర్మీ తరపున కోరుతున్నాం ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పిలిచిన గౌడ కుల సంఘాలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో మాణిక్ ప్రభు గౌడ్ గౌడ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్ సొసైటీ చైర్మన్ హనుమంతు గౌడ్ లక్ష్మయ్య గౌడ్ జహీరాబాద్ టౌన్ ప్రెసిడెంట్ విట్టల్ గౌడ్ నరేష్ గౌడ్ కిరణ్ గౌడ్ (సర్పంచ్ డప్పూర్ ) పరమేశ్వర్ గౌడ్ భీమ్ ఆర్మీ నాయకులు గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఎలాంటి గుర్తింపు లేకుండా నడుస్తున్న శ్రీ చైతన్య స్కూల్ పై చర్య తీసుకోండి

## పి డి ఎస్ యు డివిజన్ కార్యదర్శి ఈ గోపాల్



**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 18**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పి డి ఎస్ యు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఎలాంటి గుర్తింపు లేకుండా నడుస్తున్న శ్రీ చైతన్య స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అనంతరం పి డి ఎస్ యు డివిజన్ కార్యదర్శి ఈ గోపాల్ మాట్లాడుతూ విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల జీవితాలను ఆగం చేయాలని చూస్తున్న యజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి తక్షణమే ఎలాంటి గుర్తింపు లేకుండా ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడిపించడం విద్యార్థుల జీవితాలను ఆగం చేయాలని చూడడం సరైన తీరు కాదు తక్షణమే శ్రీ చైతన్య యజమాన్యంపై చర్యలు తీసుకొని విద్యార్థుల జీవితాలను కాపాడాలని అన్నారు అంతే కాకుండా విద్యను వ్యాపారంగా చేసి తమ లాభార్జన దేంగా ముందుకు వెళ్లాలని ఆలోచన విరమించుకోవాలని తక్షణమే క్రిములు కేసు నమోదు చేసి విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు సంసిద్ధమవుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు డివిజన్ నాయకులు కే వరలక్ష్మి పి హారిక పి భాగ్యశ్రీ కె అంజలి బి సాయి ప్రియ పి ప్రియాంక మీరా షా సునీల్ ఈ చరణ్ తదితరులు పాల్గొనడం జరిగింది

# మెదక్ జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న 376 జన్మదిన వేడుకలు





**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 18**

బహుజన నాయకుడు, పోరాట యోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుబడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను భావితరాలకు తెలిసేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతిని పురస్కరించుకుని పసుపులేరు ఒడ్డున రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి పూలమాలలు వేసి బి.సి.అధికారులు, బి.సి.కులసంఘాలు, ఇతర కులసంఘ నాయకులతో బి.సి.సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా కవులు, కళాకారులకు నిలయమని, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవిత చరిత్ర రచించి భావితరాలకు పుస్తక రూపంలో అందించాలన్నారు.అణగారిన వర్గాల, శ్రమజీవుల కష్టాన్ని దోచుకునే వారిని ఎదిరించి పోరాడి సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తపించిన మహానీయుడని కొనియాడారు. చైతన్యానికి స్ఫూర్తి నిచ్చిన పోరాట యోధుని గాథలు ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ , బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఉపేందర్, బీసీ వెల్ఫేర్ సహాయ అధికారి గంగా కిషన్, ఎక్సైజ్ సూపర్ ఇండెంట్ , నరసింహారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు నోముల శ్రీకాంత్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ గౌడ్, బిసి కుల సంఘ ప్రతినిధులు దామోదర్ గౌడ్ , జనార్ధన్ గౌడ్ , కృష్ణ గౌడ్ , చింతకింది కృష్ణగౌడ్ , లక్ష్మీనారాయణ గౌడ్ ఇతర కుల సంఘాల ప్రతినిధులు బీసీ సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టి వై జె ఎఫ్ చాంబర్స్ కమిటీ చైర్మన్ పివి ప్రభాకర్ రావు జన్మదిన వేడుకలు..






**ప్రజా రిపబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 18** టి వై జె ఎఫ్ చాంబర్స్ కమిటీ చైర్మన్ మాజీ ప్రధాని స్వర్గీయ పి వి నర్సింహారావు తనయుడు పి వి ప్రభాకర్ రావు గారి 72 వ జన్మదినాన్ని పురస్కరించుకొని టి వై జె ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా తనుగుల జితేందర్ రావు ఆదేశాల మేరకు టి వై జె ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మెహబూబ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది..ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కామగల్ల నరేష్ మాట్లాడుతూ పి వి ప్రభాకర్ రావు గారు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని,ఆయురారోగ్యాలతో పేదలకు మరెన్నో సేవలు చేయాలని కోరుతూ సంగారెడ్డి టి వై జె ఎఫ్ జిల్లా కమిటీ తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో టి వై జె ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ గుప్తా, సంగారెడ్డి పట్టణ ఉపాధ్యక్షులు మహేందర్, జాయింట్ సెక్రటరీ జెల్లా బాగయ్య,ఆందోల్ కన్వెన్సీ ఉపాధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల్ నుండి ఖానాపూర్ వరకు బోర్నపల్లి ద్వారా బస్సు నడపాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కోరిన గ్రామ సర్పంచ్ కొడిపెల్లి రాజవ్వ



**రాయికల్ మండలం ఆగస్టు18( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామానికి అదనపు బస్సు కావాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కి విన్నవించగా సానుకూలంగా స్పందించినారు వెంటనే జగిత్యాల డిఎంతో మాట్లాడి బస్సు వేయవలసిందిగా విన్నవించినారు

ఈ సందర్భంగా ఈ బోర్నపల్లి గ్రామానికి బస్సు సమస్య చాలా రోజుల నుండి సుదీర్ఘమైన సమస్యగా ఉన్నది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి తప్పకుండా బస్సు నడపాలి అని అలాగే మద్దిపడగ లింగాపూర్ మీదుగా ఖానాపూర్ వరకు మరొక బస్సు నడపాలని జగిత్యాల డిఎం తో మాట్లాడినారు ఈ సందర్భంగా బోర్నపల్లి సర్పంచ్ కోడిపెల్లి రాజవ్వ (అంజనేయులు )చింతలూరు సర్పంచ్ వనితా రమేష్ మంక్తత్య నాయక్ తండా సర్పంచ్ మాలోతి తిరుపతి ధావన్ పల్లి సర్పంచ్ ( రాయికల్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు )ప్రసాద్ రాయికల్ మాజీ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు,ఎక్స్ఎంపీటీసీ కోల శ్రీనివాస్ రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రావు మరియు తదితరులు పాల్గొన్నారు

# రాయికల్ ఉత్తమ అవార్డుకు ఎంపిక కైనా తహశీల్దార్ నాగార్జునను సన్మానించిన పట్టణ సింగిల్ విండో అధ్యక్షులు ఏనుగు మల్లారెడ్డి కాంగ్రెస్ నాయకులు

**రాయికల్ మండలం ఆగష్టు,18( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల జిల్లా స్థాయి ఉత్తమ తహసిల్దార్ గా అవార్డుకు ఎంపికైన రాయికల్ తాసిల్దార్ నాగార్జునసాగర్ నుమర్యాదపూర్వకంగా కలిసి పూల గుచ్చమిచ్చి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన రాయికల్ సింగల్ విండో అధ్యక్షులు ఏన్గు మల్లారెడ్డి, మాజీ మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు, మునిసిపల్ ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ పల్లికొండ గంగాధర్,చెర్లకొండపూర్ సర్పంచ్ అల్లాకొండ సుదర్శన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వాసం రాజేందర్ లు శుభాకాంక్షలు తెలిపారు





# అల్లిపూర్ లో సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నా

## మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి,మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్

**రాయికల్ మండలం ఆగష్టు,18( రిపబ్లిక్ న్యూస్)**

జగిత్యాల్ జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నామాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ...సర్వాయి పాపన్న సాధారణ గీత కుటుంబంలో జన్మించినప్పటికీ భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పెట్టుబడిదారుల విధానాలకు వ్యతిరేకంగా బహుజన సమాజాన్ని స్థాపించాలనే లక్ష్యంతోని ఒక పోరాట యోధునిగా మారినాడు

కిలాసాపూర్ కేంద్రంగా ఒక కోట ఏర్పాటు చేసుకొని గోల్కొండ కోటపై జెండా ఎగరవేసినాడు

సర్వాయి పాపన్న గౌడ కులము లో జన్మించడం గీత కార్మికులు గర్వ కారణంగా భావించాలి

సర్వాయి పాపన్న రేణుక ఎల్లమ్మ తల్లి ఆరాధకుడు వారు గీత వృత్తి ప్రోత్సహింపచేయడానికి అనేక విధాల మార్పులు తీసుకురావడం జరిగింది

సర్వాయి పాపన్న భౌతికంగా మనలో లేనప్పటికీ వారి ఆలోచన విధానాలు మనలో ఒక స్ఫూర్తినిచ్చే విధంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధనకు తోడు పడిందని చెప్పక తప్పదు

ఆనాడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ ఆరంభంలో పెద్దలు కేసీఆర్ బహుజన నాయకుల అందరి స్ఫూర్తితోని ఏ విధంగా భోజనం రాజ్యం స్థాపింప చేయడానికి పోరాటం చేయడం జరిగిందో అదే స్ఫూర్తితో ని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం తెలంగాణ రాష్ట్రం సాధింప చేసుకోవడం జరిగింది



సాధారణ గీత కార్మిక కుటుంబంలో జన్మించి గోల్కొండ కోట కిలాపై జెండా ఎగరవేయడం అంటే ఎవరు ఊహించలేదు

సర్వాయి పాపన్న ది గెరిల్లా యుద్ధ నైపుణ్యం

కెసిఆర్ సమగ్ర కుటుంబ సర్వే చేపిస్తే 51% బహుజన్లు ఉన్నారు రేవంత్ రెడ్డి సర్వేలో బీసీ శాతం ఎలా తగ్గింది ఎక్కడైనా జనాబ పెరుగుతుంద తగ్గుతుందా

**గీత వృత్తి అనేది అత్యంత ప్రమాదకరమైనది**

కల్లు అనేది ఆరోగ్యానికి మంచిదని డాక్టర్లు కూడా చెబుతున్నారు అలాంటి వృత్తి ఇప్పుడు ప్రమాదంలో పడిపోయింది ఈ బెల్ట్ షాపుల వల్ల గీత వృత్తి పడిపోయింది

ప్రభుత్వానికి ఆదాయం కనిపిస్తుంది కానీ ప్రజల ఆరోగ్యం కనిపించడం లేదుపోలీసు వాళ్లు తాగుమని చెప్పేది వాళ్లే ఊదిపిచ్చేది వాళ్లే పోలీస్ శాఖకు ఇది ఒక ఆదాయం మార్గం అయిందిరాజకీయాలు ఎలా ఉన్నా బలహీనవర్గాల కులవృత్తులు ప్రోత్సహించాలి

అల్లిపూర్ గురుకులం స్కూల్లో 75 శాతం బలహీన వర్గాల



వారున్నారు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రతిపాదించారు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్త పాఠశాల కాదు రేవంత్ రెడ్డి నూతన విద్య విధానం మెరుగైన బోధన చేయడానికి కొత్త పాఠశాల ఏర్పాటు చేయండి మేం సంతోషపడతాంకెసిఆర్ ఏర్పాటు చేసినటువంటి ఈ గురుకుల పాఠశాలలు అన్నింటినీ కూడా తరలించి ఇంటిగ్రేటెడ్ స్కూల్లో పెడతారంట ఇది ఆశ్చర్యంగా ఉంది

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వెనుకబడిన తరగతుల వారికి విద్యా ఉద్యోగ అవకాశాల్లో అవకాశాలు రావాలని రిజర్వేషన్లు కల్పింప చేస్తే దాన్ని కెసిఆర్ అవలంబించారు గీతా కార్మికులకు ప్రమాద బీమా సంవత్సరమైనా ఆర్థిక సహకారం సహాయం అందడం లేదు

దేశంలో ఎక్కడలేని విధంగా బీడీ కార్మికులకు పింఛన్లు ఇస్తే ఇప్పుడు కొత్త పింఛన్లు రావడం లేదు

అందరం సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి. ఎందుకంటే సమాజం మార్పు రాజకీయ మార్పు అనేది మనం కోరుకోవాలి

# ఎస్సీ ఏ వసతి గృహంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ షూస్ అందజేసిన జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ( చిట్టిబాబు )



**ప్రజా పబ్లిక్ న్యూస్ స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 18**

జోగిపేట బాలుర రాజ ా హాస్టల్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల పేద పిల్లల కోస్రం స్కూల్ బ్యాగులు మరియు షూస్ ఈరోజు వాళ్లకు అంద జేయడం జరిగింది ఈ కార్యక్రమం లో వార్డెన్ నర్సిములు గారు రవికృష్ణ గారు ఆత్మ కమిటి డైరెక్టర్ ఖాలేదు గారు కాంగ్రెస్ పార్టీ నాయకులు సోహెయిల్ గారు మరియు హాస్టల్ సిబ్బంది ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు



# మున్సిపాలిటీ వారిగా ఫొటో, ఓటర్ల జాబితా ప్రచురణకు సన్నద్ధత ఉండాలి

**గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల పరిశీలన మరియు ప్రచురణ కార్యక్రమం పూర్తి చేయాలి**

**జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా మందస్తు చర్యలు చేపట్టాలి**

**పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా**



**నంద్యాల బ్యూరో, ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** మునిసిపాలిటీ వారిగా వారీగా ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణకు అవసరమైన సన్నద్ధత చర్యలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ఆరు నియోజకవర్గ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోనే కలెక్టర్ ఛాంబర్ నందు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, త్రాగునీటి సరఫరా కొరకు చేపట్టవలసిన చర్యలు, పరిశుభ్రత పై జెడ్పి సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని లలితా బాయి, ఆరు మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు అన్ని మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఫోటో, ఓటర్ల జాబితాను సిద్ధం చేసి 03-09-26 వ తేదీన సంబంధిత కార్యాలయాల్లో ప్రచురించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల పరిశీలన మరియు ప్రచురణ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. అందుకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు కార్యక్రమం 18.08.2026 నుండి ప్రారంభం అవుతుందని తెలిపారు. జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరాపై మందస్తు చర్యలు తీసుకొని ఎక్కడ కూడా త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో పగడ్బందీగా చేపట్టాలని స్వచ్ఛతపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు.

## కర్నూలు ఎయిర్‌పోర్ట్‌లో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఘన స్వాగతం

**డ్రోన్ పరిశ్రమ సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు కర్నూలుకు రాక**






**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 18)**
ఓర్వకల్లు మండలంలోని కర్నూలు డ్రోన్ సిటీలో నిర్వహించనున్న ఏపీ డ్రోన్ పరిశ్రమ సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కర్నూలుకు చేరుకున్నారు.
కర్నూలు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న కేంద్ర మంత్రికి కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి, జిల్లా టీడీపీ నాయకులు గౌరు వెంకటరెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.
అనంతరం కేంద్ర మంత్రి ఓర్వకల్లు డ్రోన్ సిటీలో జరిగే సమావేశంలో పాల్గొని రాష్ట్రంలో డ్రోన్ పరిశ్రమ అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతికత, భవిష్యత్ అవకాశాలపై పరిశ్రమల ప్రతినిధులతో

## ఆగస్టు 22వ తేదీ న నంద్యాల జిల్లాస్థాయి చెస్ పోటీలు

**..12 వివిధ వయసు కేటగిరీలలో వేరు వేరు గా పోటీలు.**

**.. ఎన్జీవోస్ కాలనీ లో ఉన్న అచీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు.**



**నంద్యాలఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ ఆర్ జి ఎస్ అకాడమీ నిర్వహణలో ఈనెల 22వ తేదీన నంద్యాల ఎన్జీవోస్ కాలనీలో ఉన్న అచీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రామ సుబ్బా రెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పోటీలు 12 వివిధ వయసు విభాగాల్లో వేరువేరుగా జరుగుతాయని తెలిపారు. టోర్నమెంట్ కోఆర్డినేటర్ గా అచీవర్స్ స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ వ్యవహరిస్తారని అన్నారు. జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన వారికి ఒక్కొక్క క్యాటగిరి లో 10 ప్రైజ్ ల చొప్పున మొత్తం 120 ప్రైజ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు.
ఆసక్తి ఉన్న చెస్ క్రీడాకారులు ఏపీ చెస్ వెబ్సైట్ ద్వారా ఈనెల 21 వ తేదీ సాయంత్రం లోపు ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9010451585 నెంబర్ ను సంప్రదించాలని తెలిపారు.

## నంద్యాలలో రాయలసీమ జోనల్ తైక్వాండో పోటీలు

**..రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నిర్వహణ.**

**..పోటీల పోస్టర్స్ ఆవిష్కరించిన కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, నిర్వాహక కార్యదర్శి రియాజ్.**




**నంద్యాల ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):** ఉమ్మడి కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22,23వ తేదీలలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ప్రథమ రాయలసీమ జోనల్ స్థాయి తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్. టి . చంద్రమౌళి, జిల్లా కార్యదర్శి సర్దార్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక క్రీడా సమాఖ్య కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్స్ ను ఉమ్మడి కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్,అంతర్జాతీయ లయన్స్ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, పోటీల నిర్వాహక కార్యదర్శి రియాజ్, కోచ్ లు బాలకృష్ణ, షానవాజ్ లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్ లో తైక్వాండో క్రీడ ఒలింపిక్స్ లో గుర్తింపు పొందిన క్రీడ అన్నారు. తైక్వాండో లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు టోర్నమెంట్ లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి బహుమతులు సాధించాలని కోరారు. టోర్నమెంట్ లో పాల్గొనడం ద్వారా తమ ప్రావీణ్యాన్ని మెరుగు పరుచుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. 23వ తేదీ ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

## సుగాలి ప్రీతి భాయ్ తల్లి పార్వతి వీల్‌చైర్ యాత్రకు అనుమతి లేదు.

**కర్నూలు నుంచి అమరావతి వరకు వీల్‌చైర్ యాత్రకు అనుమతి నిరాకరణ.**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. -కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**

**కర్నూలు ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**
సుగాలి ప్రీతి భాయ్ కేసు నేపథ్యంలో ఆమె తల్లి పార్వతి కర్నూలులోని స్మశాన వాటిక నుంచి అమరావతి వరకు వీల్‌చైర్ యాత్ర నిర్వహించేందుకు అనుమతి లేదని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మంగళవారం తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వీల్‌చైర్ యాత్రకు పోలీసుల నుంచి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. అనుమతి లేని యాత్రకు ఎలాంటి మినహాయింపు ఉండదని, నిబంధనలు ఉల్లంఘించి వీల్‌చైర్ యాత్ర చేపట్టడం లేదా ఇతరులను సమీకరించి ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం జరిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.




# ప్రపంచ డ్రోన్ హబ్ గా ఏపీ

**ఓర్వకల్లు డ్రోన్ సిటీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు**

**అన్నిరంగాల్లో పెరిగిన డ్రోన్ వినియోగం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో పారిశ్రామికవేత్తల రాక**

**డ్రోన్ల ఎగమతితో పెరగనున్న దేశ ఖ్యాతి**

**డ్రోన్ కంపెనీల సిఇవోలతో రామ్మోహన్ నాయుడు భేటీ**



**కర్నూలు,ఆగస్టు 18 (రిపబ్లిక్ న్యూస్):**డ్రోన్ సిటీకి దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రానుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుఅన్నారు. అన్ని రంగాల్లో ఇప్పుడు డ్రోన్‌ల వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలో వివిధ డ్రోన్ సంస్థలకు చెందిన సీఈవోలతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 6 లక్షల డ్రోన్‌ల అవసరం ఉండగా.. ప్రస్తుతం 40 వేల డ్రోన్లు మాత్రమే ఉన్నాయని వివరించారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ చూసి.. డ్రోన్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఓర్వకల్లులో 600 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఈ సిటీలో డ్రోన్ల తయారీ, ప్రొడక్షన్, శిక్షణ అన్ని ఉంటాయని వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయని అన్నారు. డ్రోన్ శక్తిని వాటి పనితీరును ప్రధాని మోదీ గుర్తించారని చెప్పారు. మన టెక్నాలజీని ఉపయోగించి మనమే డ్రోన్ తయారు చేసి.. విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రధాని మోదీ సంకల్పించారని గుర్తు చేశారు. విదేశాల నుంచి డ్రోన్ల దిగుమతిని కేంద్రం నిషేధించిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భారతదేశంలోనే తొలి అతిపెద్ద డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వివిధ డ్రోన్ కంపెనీలతో సమీక్ష నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకోంటామని తెలిపారు. 150 కంపెనీలకు చెందిన డ్రోన్ సంస్థల ప్రతినిధులతో ఈ కార్యక్రమం నిర్వహిచడం పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే అసెంబ్లీలో డీఎస్సీ-2025పై చర్చకు రావాలని మంత్రి నారా లోకేశ్ ఆహ్వానిస్తే.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పించుకుని తిరుగుతున్నారని
రామ్మోహన నాయుడు ఎద్దేవా చేశారు. మంత్రి లోకేశ్ సవాల్ స్వీకరించి.. అసెంబ్లీలో చర్చకు రావాలని వైఎస్ జగన్‌కు ఆయన స్పష్టం చేశారు. ఓర్వకల్లులో కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీపై అసెంబ్లీలో చర్చకు లోకేశ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అసెంబ్లీకి వస్తే తన కుట్ర బయట పడుతోందనే భయంతో వైఎస్ జగన్.. చర్చకు రావడం







లేదన్నారు. కూటమిపై దుష్ప్రచారం చేసి.. తన ఉనికిని కాపాడుకోవాలని వైఎస్ జగన్ చూస్తున్నారని విమర్శించారు. టీచర్లను లిక్కర్ షాపుల వద్ద నిలబెట్టిన వ్యక్తి వైఎస్ జగన్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీచర్లను చూస్తే వైఎస్ జగన్‌కి కోపం, కక్ష అని చెప్పారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు లేకుండా.. పూర్తి పారదర్శకంగా వేలాది టీచర్ల పోస్టులు భర్తీ చేశామని కేంద్ర మంత్రి వివరించారు. ఏ ప్రభుత్వం చేయని టీచర్ ఉద్యోగాలు.. తాము భర్తీ చేశామని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లలోనే ఏపీలో ఊహించని అభివృద్ధి జరిగిందని రామ్మోహన నాయుడు తెలిపారు.



printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com